క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ పనులు జరుగుతున్న మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యం చెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పద్మావతి కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేతి రఘుపతి, సహాయ అధ్యక్షులుగా ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి, కె.లక్ష్మీచారి, ప్రధాన కార్యదర్శిగా కొండూరు ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా ఎమ్.ప్రభాకర్‌రావు, ఎస్. కరుణాకర్‌రెడ్డి, ఏ. పద్మావతి, కోశాధికారి గుత్తా నర్సింహారెడ్డి, ఆర్గనైజర్‌గా మామిడాల రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నటువా రామ్మోహన్, కె.సులోచన, ఎస్.శ్రీధర్, బి.రత్నకుమారి, కె.జవహర్‌లాల్, అలుగుబెల్లి వరలక్ష్మి, కుంభం గెల్వాల్‌రెడ్డి, సీహెచ్.శోభారాణి, సింధు లవకుమార్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా వార్డు కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా సూరి జానకిరామశర్మ వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

'వేయి గొంతుల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న కార్యవర్గ సభ్యులు

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించనున్న లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మేడి శంకర్ మాదిగ కోరారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన మాదిగ కళామండలి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మాదిగ కళామండలి మండల అధ్యక్షుడుగా వడ్డెపల్లి కోటయ్య, ప్రధానకార్యదర్శిగా జిల్లా వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా ఎరసాని లింగస్వామి, కోశాధికారిగా మేడి శేఖర్, ఉపాధ్యక్షులుగా వడ్డెపల్లి భిక్షం, గౌరవాధ్యక్షుడిగా రుద్రవరం గణేశ్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మాదిగ కళామండలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంగర సైదులు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్, మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, ప్రధానకార్యదర్శి బుస్సు శంకర్, నాయకులు సుక్క నర్సింహ, ఏర్పుల నరేష్, మాచర్ల యాదగిరి, పోకల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

కనగల్ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ భిక్షాల శ్రీనుతో పాటు 70మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, రామచంద్రారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గానూతుల రాంరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని ముషంపల్లి రోడ్‌లో శబరి శిరీష భజన బృందం పెరిక సునీల్, దాసరి శివ, మల్లి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, నివాస్, ఇద్ది రాములు, హనుమాన్ ప్రసాద్, దుగ్యాల శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, సుగుణ, సునంద, రోజా, పుష్ప, కవిత, మంజుల, మాధవి, పద్మ ప్రసన్న, శికిలంబట్ల భజరంగ్ పాల్గొన్నారు.

సంప్రదాయ 'విస్తర్ల'తో ఉపాధి

- అడ్డాకు, మోదుగు ఆకులతో విస్తరాకుల తయారీ
- స్థానికంగా తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- స్వయం ఉపాధి పొందుతున్న మహిళ



మిషన్‌పై విస్తరాకులు తయారు చేస్తున్న నెర్మటి లక్ష్మి

రామగిరి(నల్లగొండ) : మన రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విడదీయరాని భాగమైంది. తక్కువ ఖర్చుతోపాటు సులభంగా అన్ని అవసరాలకు ఉపయోగపడేవి కావడంతో ప్లాస్టిక్ వస్తువులపై పూర్తిగా ఆధారపడడం బాగా పెరిగిపోయింది. తక్కువ మైక్రాన్‌తో తయారు చేసిన ప్లాస్టిక్ ప్లేట్లు, టీ కప్పులు, క్యారీ బ్యాగులు, వాటర్ బాటిళ్ల మార్కెట్‌లో విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. నిత్యం హోటళ్లు, శుభకార్యాల్లో ప్లాస్టిక్‌తో తయారు చేసిన విస్తరాకుల వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే ప్లాస్టిక్ వినియోగం వల్ల కొత్త చిక్కులు వస్తున్నాయి. వీటి వాడకం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు మొక్కల ఆకులతో విస్తరాకులు తయారు చేస్తున్నారు. వీటిని వినియోగించడం వల్ల ఆరోగ్యానికి లాభం చేకూరడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు మనవంతు భాగస్వాములం కావొచ్చు.



వివిధ సైజుల్లో తయారు చేసిన విస్తరాకులు

ఆకుల్లోని ఔషధ గుణాలతో ఆరోగ్యానికి మేలు

శుభకార్యాలు, విందులు, వివాహాల్లో ఇప్పటివరకు ఎక్కువగా ప్లాస్టిక్ ప్లేట్లను ఉపయోగిస్తూ వస్తున్నారు. దీని కారణంగా పర్యావరణం పూర్తిగా కలుషితమవుతోంది. తిని పడేసిన వ్యర్థాలు, డిస్పోజబుల్ వస్తువులతో మానవాళికి కీడు జరుగుతోంది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని కాపాడుకునేందుకు, పొల్యూషన్‌ను అరికట్టేందుకు ముందుకు వచ్చింది నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన నెర్మటి లక్ష్మి. అడ్డాకులు, మోదుగు ఆకులతో విస్తరాకులను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడంతోపాటు స్వయం ఉపాధి పొందుతోంది. పర్యావరణహితం కోరుతూ వీటిని తయారు చేస్తుండడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ బాగా ఏర్పడింది. వివాహాలు, విందులు, పార్టీలకు వచ్చే అతిథుల కోసం ప్లాస్టిక్ ప్లేట్లను ఉపయోగించడం కంటే సంప్రదాయ పద్ధతిలో ఆకులతో తయారు చేసిన ఇస్తరాకులను వాడడం మంచిదని ప్రజలు ఆలోచిస్తున్నారు. ఈ ఇస్తరాకుల్లో ఆహారం తినడం వల్ల ఆకుల్లోని ఔషధ గుణాలు కొంత వరకు మన అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. ప్రజలు ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి ఆకులతో తయారు చేసిన సంప్రదాయ విస్తరాకులను వినియోగించినట్లయితే తమలాంటి వారికి ఉపాధి లభించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసినవారం అవుతామని లక్ష్మి పేర్కొంటున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ఆరోగ్యానికి మేలు చేసేలా మొక్కల ఆకుల నుంచి విస్తరాకులను తయారు చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆకులను దిగుమతి చేసుకుని ఇంటిలో విస్తరాకులు తయారు చేస్తాం. హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, గుంటూరు, తెనాలి, విజయవాడ ప్రాంతాలకు విస్తరాకులను ఆర్డర్లపై పంపిస్తున్నాం. అప్పు చేసి మిషనరీ కొనుగోలు చేసి విస్తరాకుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాను. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం, ప్రజల నుంచి ఆదరణ లభిస్తే ఉత్పత్తులను మరింత పెంచుతాం.

–నెర్మటి లక్ష్మి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు స్వాధీనం చేయాలి



నల్లగొండ టౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



చిట్యాల: గుండ్రాంపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లాటరీ ద్వారా ఎంపిక చేసిన 552 మంది లబ్ధిదారులకు జనవరి 26 నాటికి ఇళ్లను స్వాధీనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయి, లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను స్వాధీనం చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అసంపూర్తిగా, మౌలిక సదుపాయాలు లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు నిధులు కేటాయించి పూర్తిచేసి ప్రజలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ హాశం, దండంపల్లి సత్తయ్య, ఎండీ సలీం, అవుట రవీందర్, తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, ఊట్కూరి మధుసూదన్ రెడ్డి, భూతం అరుణ, మారగోని నగేష్, సీత, వెంకటయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయాలి

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని చిట్యాల మండల సీపీఎం సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. గుండ్రాంపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆదివారం సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించిన ప్రభుత్వం నేటికీ పూర్తి చేయలేదన్నారు. సంబధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి, అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి కత్తుల యాదయ్య, పార్టీ నాయకులు ఎండీ.జహంగీర్, జోగు లక్ష్మయ్య, పిన్నింటి నారాయణరెడ్డి, కురాకుల అంజయ్య, రత్నం యాదయ్య, అశోక్, మైదీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర మందులతో వైద్య సేవలు



మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర మందులతో వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రధానంగా చిన్నపిల్లల వైద్యానికి అవసరమైన టానిక్‌లు, మాత్రలు అందుబాటులో లేవు. అంతేకాకుండా పెద్దలకు సంబంధించిన మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పలువురు రోగులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సిబ్బంది వివరణ కోరగా ప్రతి నెలా జిల్లా కేంద్రం నుంచి సరఫరా చేయాల్సిన మందుల్లో కొన్ని మాత్రమే సరఫరా అవుతున్నాయని చెబుతున్నారు. సరఫరా అయినా మందులను ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇస్తున్నామని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మునుగోడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మందులను పూర్తిస్థాయిలో సరఫరా చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కూసుకుంట్ల రాజిరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

రామగిరి(నల్లగొండ): తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా 2025 సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏఏ ఖాన్, అధ్యక్షుడు ఎంఏ అలీమ్, కార్యదర్శి మహమ్మద్ ముయీజ్, ఎంఏ అజీజ్, ప్రొఫెసర్ సయ్యద్ అలీ, డీఐ రాజు, సయ్యద్ అన్వర్, అతీఖ్ అహ్మద్, పర్వేజ్, ఉరుజ్ అఫ్జ, మార్, మహ్మద్, ఖాసీం, ఖాదర్, ఫాతిమా జహెరా, యూసుఫ్, గఫ్ఫార్, నజీర్, ముమ్మద్ అలీ, లతీఫ్‌ఖాన్, అఫ్జల్ బాబా, గఫూర్, షాకీర బేగం తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రాజిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : కనగల్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూసుకుంట్ల రాజిరెడ్డి ఇటీవల ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ) నాన్ అఫీషియల్ సభ్యుడిగా నియమితులయ్యారు. కాగా ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, కలెక్టర్ ఇలా త్రిపాఠిని రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజిరెడ్డికి మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ అభినందనలు తెలియజేశారు.

'భగీరథ నీటిలో ఫ్లోరైడ్ లేదు'

మర్రిగూడ : మిషన్ భగీరథ నీటిలో ఫ్లోరైడ్ లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడారు. డిసెంబర్ 19 నుంచి మర్రిగూడ మండల కేంద్రంలోని ఒక ఆర్వో ప్లాంట్‌తోపాటు మండలంలోని పలు ప్రాంతాల్లో 49 చోట్ల మిషన్ భగీరథ నల్లాల నుంచి నీటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం దేవరకొండలోని సబ్ డివిజన్ లెవల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబోరేటరీకి పంపించామన్నారు. లీటర్ ఫ్లోరైడ్ లెవెల్స్ 1.0 నుంచి 1.5 మిల్లీ గ్రాములు ఉండాల్సి ఉండగా మిషన్ భగీరథ నీటిలో 0.43 మిల్లీ గ్రాములు వరకు మాత్రమే ఉందన్నారు. భగీరథ నీటిలో ఫ్లోరైడ్ ఆనవాళ్లు లేవని తేలినట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నకిరేకల్ : ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని విద్యా గ్రామర్ స్కూల్‌లో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వైద్యం వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సుధాకర్, కమిటీ సభ్యులు సంతోష్‌నాయక్, నాగరాజు, హరీష్, తౌఫిక్, ప్రవళిక, ప్రియాంక పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : మండలంలోని నోముల జెడ్పీ హైస్కూల్‌లో 1982–83 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు 30 కుర్చీలను బహుకరించారు. అదేవిధంగా తోటి విద్యార్థి ఎస్‌కె ఖదీర్ పాష అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.60 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆనాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.లోకనాథం, యస్.యోగిబాబు, ఎం.సంపత్‌రెడ్డి, ఎస్.నర్సిరెడ్డి, ఎం.గీత, ఎం.అరుణ, వై.యాదగిరిరెడ్డి, ఎ.సైదులు, లతీఫ్, బ్రహ్మచారి, వెంకటేశ్వర్లు, వెంకటేషం, సురేష్‌రెడ్డి, అరుణ, పద్మ, రాములమ్మ, శ్రీనివాస్, దామోదరాచారి, వీరయ్య, శ్రవణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1987–88 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సయ్యద్ జాకీర్‌అలీ, శంకరాచారి, కృష్ణయ్య, కమ్మంపాటి రాములు, గడ్డం వెంకటేశ్వర్లు, గంజి రమేష్, ధర్మయ్య, వీరమల్లు, రమేష్, రామాచారి, ఉషారాణి, రమాదేవి, లక్ష్మి, శ్రీదేవి, అండాలు, మంగమ్మ, వనజారాణి, విజయలక్ష్మి, పద్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



రామగిరి(నల్లగొండ): సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



నార్కట్‌పల్లి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వాలదే



మాట్లాడుతున్న ప్రభావతి

నల్లగొండ టౌన్: మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వాలదే అని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. ఆదివారం నల్లగొండలోని బాల భవనంలో ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. మహిళలకు, బాలలకు పౌష్టికాహారం అందకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారని అన్నారు. పౌష్టికాహారం అందించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఆడపిల్లల నిష్పత్తి రోజురోజుకూ తగ్గిపోతోందన్నారు. చదువుకున్న మహిళలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి



మాట్లాడుతున్న కందాల ప్రమీల

నకిరేకల్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీలా కోరారు. ఆదివారం నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుపేదలను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు ఆకుల భాస్కర్, కొప్పుల అంజయ్య, చెన్నబోయిన నాగమణి, బహురోజు ఇందిరా, వంటెపాక కృష్ణ, ఎర్కలి అంజయ్య, గింజల లక్ష్మీ, బొడ్డుపల్లి లక్ష్మీ, నర్సయ్య, వెంకట్‌రంగారెడ్డి, బండమీది యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల సాయం

కనగల్: మండలంలోని రేగట్టె గ్రామానికి చెందిన గజమల్ల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రమేష్ స్నేహితులు, గ్రామ టెంపుల్ టీం యూత్ సభ్యులు అండగా నిలిచి ఆదివారం రూ.23,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. కారింగు సతీష్, అవగాని రాజు, కట్ట గణేష్, సయ్యద్, పులకరం నాగరాజు, పాలకూరి అశోక్, అవగాని వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న స్నేహితులు

మోకాళ్లపై నిలబడి నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

నకిరేకల్ : ఒప్పందం ప్రకారం పెరిగిన హమాలీ రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని కోరుతూ నకిరేకల్‌లోని సివిల్ సప్లయ్ గోదాం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా హమాలీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి దొనకొండ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భద్రయ్య, అశోక్, పరమేష్, ముత్తయ్య, రవి, బాలస్వామి, సైదులు, బాలరాజ్, లింగయ్య పాల్గొన్నారు.

'శంఖారావం'కు తరలిన హిందువులు

నకిరేకల్ : ఆలయాల పరిరక్షణ, హిందువుల ఐక్యత, హిందూ సంస్కృతి సంప్రదాయలను కాపాడాలనే ఉద్దేశంతో ఆదివారం విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం కార్యక్రమానికి నకిరేకల్‌లోని హిందూ జన చైతన్య వేదిక సభ్యులు తరలివెళ్లారు. ధర్మజాగరణ సమితి ప్రతిని బ్రహ్మదేవర రవిశంకర్ తదితరులు తరలివెళ్లారు.

అర్బన్ ఆస్పత్రికి సొంత భవనం

- రూ.1.43 కోట్ల నిధులతో నిర్మాణం
- జైల్‌ఖానా స్థలం 400 గజాలు కేటాయింపు
- ఇన్నాళ్లూ అద్దె భవనంలో ఇబ్బందులు పడిన వైద్యులు, రోగులు



నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలోని హైదర్‌ఖాన్‌గూడలో ఉన్న అర్బన్ ఆస్పత్రికి సొంత భవనం కల నెరవేరనుంది. మున్సిపాలిటీకి ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నారు. రూ.1.43 కోట్ల నిధులతో రెండంతస్తుల (జీప్లస్ వన్) భవన నిర్మాణం చేపడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యులకు, సిబ్బందికి గదులతోపాటు రోగుల కోసం అన్ని సౌకర్యాలు ఉండేవిధంగా భవన నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే రెండంతస్తుల భవన నిర్మాణం స్లాబ్ పనులు పూర్తికావొచ్చాయి. ఫిబ్రవరి నెలాఖరు నాటికి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నారు.

పెరగనున్న ఓపీ సేవలు

కొత్త భవనం పూర్తయితే ఇక్కడికి రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ముషంపల్లి–నల్లగొండ ప్రధాన రహదారి పక్కన జైల్‌ఖానా వద్ద, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఎదుట ఈ కొత్త భవనం నిర్మిస్తున్నారు. గతంలో ఒకటి రెండు వార్డులకే పరిమితమైన ఈ దవాఖానాలో ఇక నుంచి ఏడెనిమిది వార్డులతోపాటు పలు గ్రామాలకు చెందిన వారికి వైద్యం అందనుంది. నల్లగొండ ముషంపల్లి రోడ్‌లో ఉన్న దాదాపు 10 గ్రామాల ప్రజలకు ఇక్కడ వైద్య సదుపాయం అందుబాటులోకి రానుంది. రోజుకు వంద మందికి పైగా ఓపీ వచ్చే అవకాశం ఉంటుంది.

మంత్రి సహకారంతో..

ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు ఉన్నా స్థలం లేకపోవడంతో అరకొర వసతుల మధ్య అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గతంలోనే జైల్‌ఖానా స్థలం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ప్రయత్నించినప్పటికీ జైల్ అధికారులు నిరాకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జైల్ అధికారులతో మాట్లాడి ఆస్పత్రి భవన నిర్మాణం కోసం పట్టుబట్టి 400 గజాల స్థలం కేటాయించేవిధంగా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా హైదర్‌ఖాన్‌గూడ మూల మలుపు వద్ద కూడా రోడ్లు విస్తరించడానికి మరో 100 గజాల స్థలం తీసుకున్నారు. రోడ్డు వెడల్పు కోసం ఇప్పటికే జైల్ ప్రహరీ పక్కన ఉన్న డబ్బాలను తొలగించారు.

ఇన్నాళ్లూ ఇరుకు రోడ్‌లో ఉన్న ఆస్పత్రి...

నీలగిరి పట్టణంలోని హైదర్‌ఖాన్‌గూడలో ఉన్న అర్బన్ ఆస్పత్రికి సొంత భవనం లేకపోవడంతో వైద్యులతోపాటు ఆస్పత్రికి వచ్చే రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అర్బన్ ఆస్పత్రికి సొంత భవనం నిర్మించాలని గత కొన్నాళ్లుగా భావించారు. కానీ అక్కడ స్థలం దొరకకపోవడంతో సంవత్సరాల కొద్దీ కాలయాపన జరుగుతూ వచ్చింది. అద్దె భవనం కావడం, సరైన సౌకర్యాలు లేకపోవడం, కాలనీలో ఇరుకు రోడ్డులో ఉన్న కారణంగా అక్కడ ఆస్పత్రి ఉన్న విషయం కూడా ఎక్కువ మందికి తెలియదు. దాంతో పెద్దగా రోగులు కూడా వచ్చే వారు కాదు. కనీసం పది మంది వస్తే బైక్‌లు కూడా పార్కింగ్ చేయడానికి స్థలం లేదు. ఇప్పుడు ఎట్టకేలకు అందరికీ ఉపయోగపడే విధంగా ప్రధాన రహదారి పక్కన అర్బన్ ఆస్పత్రి భవన నిర్మాణం చేపడుతుండడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలగనుంది.

ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తాం



అర్బన్ ఆస్పత్రికి సొంత భవనం కల నెరవేరబోతోంది. ఫిబ్రవరి నెలాఖరులోగా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేస్తాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జైళ్ల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి భవనం కోసం 400 గజాలు కేటాయింపజేశారు. రోడ్డు వెడల్పు కోసం కూడా మరో వంద గజాలు తీసుకున్నాం.

–బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్